# పోలికలు

కర్నూలు రాగానే నా మనసు కుదుటపడింది. గతుకుల రోడ్డు మీద ప్రయాణమేమో - కర్నూలు పొలిమేరలు - బళ్ళారి చౌరస్తా - నిండైన అభయహస్తంతో ప్రాకార ఆంజనేయస్వామి - ఇరుకురోడ్డు మీద బస్సు ప్రయాణించి బస్సు స్టేషన్‌లో ఆగింది.

హాయ్! మాధవా!" లోపలికి పరుగెత్తుకుంటూ వచ్చాడు పార్థసారథి.

"హలో సారధీ! బాగున్నావా?" పలకరించాను.

"మన లగేజి ఇదేనా?" సూట్‌కేసును అందుకున్నాడు.

గబగబ బస్సు దింపి - సూట్‌కేసు, బ్యాగ్ మోసుకుంటూ స్టేషన్ బయటకు తెచ్చి, ఆటో మట్లాడి తనింటికి తీసుకుపోయాడు.

పార్థసారథి నా బాల్యమిత్రుడు. ఉద్యోగ రీత్యా నేను అమెరికాకు వెళ్ళిపోయి అక్కడే గ్రీన్‌కార్డు హోల్డర్‌నయిపోయాను. ఏ నాలుగు సంవత్సరాలకో ఇండియాకు వస్తూ ఉంటాను.

ఈసారైనా స్నేహితుల్ని కల్సుకోవాలనీ - వీలుచూసుకుని ఓరెండు రోజులుందామనీ మా ఊరునుండి కర్నూలుకు వచ్చాను.

సారథి ఇల్లు పిల్లాజెల్లలతో కళ కళ లాడుతోంది.

సారథి భార్య కనకంచెయ్యి అమృతం లావుంది. అచ్చ తెలుగు వంటకాలతో జిహ్వాను తృప్తిపరిచింది.

"ఏమోయ్! అమెరికా ఎలా ఉంది? ఏంటి విశేషాలు? "సారథి అడిగాడు.

"ఏముంది! అన్నీ మామూలే. దొరకని వస్తువుల్లేవు. కాకపోతే మొదట్లో ఇన్ని డాలర్లా అని భయపడేవాడిని. తరువాత అలవాటైపోయింది. "అంటూ అమెరికా గురించి నాకు తెల్సిన కబుర్లు చెప్పుకుపోయాను.

తరువాత సూట్‌కేసు తీసి సారథికి చిన్న కెమెరా, కనకంకు ఓ చీర, పిల్లలకు బట్టలు ఇచ్చాను.

"అరే! ఇవన్నీ ఎందుకు తెచ్చావు. నువ్వు రావడమే మాకు ప్రెజెంటేషన్ - మళ్ళీ ఇవన్నీనా!" మొహమాటపడిపోయాడు.

"అయ్యో! అన్నయ్యగారూ! అన్నీ మాకే ఇస్తే మీ వాళ్ళకు ఏమిస్తారు! అయినా ఇలా ఇవ్వాలంటే మీరు అమెరికా నుంచి ఎన్ని కొని తీసుకురావాలి. దానికి ఎంత ఖర్చువుతుంది!?" ఆశ్చర్యపోయింది.

నేను చిన్నగా నవ్వి ఊరుకున్నాను. ఆమె చెప్పింది నిజమే! అక్కడ మేమేదో తెగ సంపాదించేస్తున్నామని అందరూ అనుకుంటారు. అందరికీ ఏవేవో తీసుకువస్తామని ఎదురుచూస్తూ ఉంటారు.

ఎవరికి వాళ్ళు వాళ్ళ మటుకే ఆలోచించి తమకు ఏమీ తీసకురాలేదనీ - తెచ్చినా అది ఏమంత బాగా లేదనీ అనుకుంటారు! కాని కనకం లాగా - ఒక్కడు ఎంత మందికని - ఎన్నని తీసుకురాగలడని ఆలోచించరు, పైగా లగేజి సమస్యగురించి కూడా ఆలోచించరు.

"మాధవా! మన ఫ్రెండ్స్ ఆనందభైరవి - విషాద రాణి ఇక్కడే ఉన్నారు - తెల్సా!" అడిగాడు.

"ఆ! ఈ ఊళ్ళోనే!" ఆశ్చర్యపోయాను.

"నీ గురించి చెప్పాను! వచ్చినప్పుడు తప్పకుండా నిన్ను తీసుకురమ్మన్నారు." చెప్పాడు.

"అలాగే - సాయంత్రం పోదాం." చెప్పాను!

నిజానికి ఆనందభైరవి అసలుపేరు భారతి. ఆమె ఎప్పుడూ నవ్వుతూ ఉండేది. అందుకే మా వాళ్ళు ఆమెకు ఆపేరుపెట్టారు నిక్‌నేమ్ ఆనందభైరవి.!

అలాగే విషాదరాణి అసలుపేరు ఉషా రాణి. ఆమె ఎప్పుడూ ఏదో పోగొట్టుకున్నట్లు ఉండేది అందుకే మా వాళ్ళు ఆమెకు ఆపేరు ఖాయం చేశారు.

కాని ఇద్దరూ మంచి అందగత్తెలే!

ముఖ్యంగా సారథి అయితే వాళ్ళ వెంట తెగ తిరిగేవాడు– ఎవరో ఒకళ్ళని పెళ్ళి చేసుకోవాలని పాకులాడేవాడు.

సాయంత్రం అయింది.

ముందుగా స్కూటర్ మీద... విషాదరాణి ఇంటికి పోదామన్నాడు. కారణం ఆమె ఇల్లు దగ్గరట!

నరసింగరావు పేటలో ఓ గొప్పఇల్లు. మూడంతస్తుల భవనం! ముందు నేను ఆమె ఆ ఇంట్లో అద్దెకుంటోందని భావించాను. కాని... అది స్వంతమని – నాలుగు పోర్షన్లు అద్దెకిచ్చి– వీళ్ళు పైన ఉంటున్నారని చెప్పాడు సారథి.

రెండతస్తుల మెట్లు ఎక్కి కాలింగ్‌బెల్‌నొక్కాడు సారథి.

ఓ నిమిషానికి తలుపు తెరుచుకుంది.

మూర్తీభవించిన ఓ శోక దేవత తలుపులు తెరిచి గుమ్మం దగ్గర నిల్చుంది.

"రాణీ! ఎవరొచ్చారో చూశావా?" సారథి అడిగాడు.

"ఈయన... మాధవరావు కదూ!" తడబడ్తూ చెప్పింది.

"థాంక్యూ! నన్నింకా మర్చిపోలేదు–" లోపలికి అడుగుపెడుతూ చెప్పాను.

లోపల ఫర్నిచరు – తివాచీ – అలంకరణ గొప్ప టేస్టును ప్రతిఫలిస్తున్నాయి.

"కూర్చోండి మాధవరావుగారు!"

"అబ్బే! నన్ను మాధవా! అంటే చాలు గతం మర్చిపోయి అండీలు పెడితే నేనిప్పుడే సెలవు తీసుకుంటాను" బెదిరించాను చనువు తీసుకుంటూ.

మాటల్లోనే ఆమె ప్లేట్‌నిండా బిస్కట్లూ మూడు కప్పులతో ఫ్రూట్‌సాలడ్ తెచ్చింది.

కబుర్లు వేగంగా దొర్లాయి. కాలేజీ రోజులు – మా లెక్చరర్ల మీద విసుర్లు – గిల్లీకజ్జాలు అన్నీ ఒక్కొక్కటీ గుర్తొచ్చాయి!

"రాణీ! మీవారు ఎప్పుడొస్తారు?" అడిగాను.

"ఆయనా! సరేలే! ఆయన వచ్చింతర్వాత టైం చూసి చెప్తా!"

"ఏం? ఆయన ఏంచేస్తారు?" అడిగాను.

"ఆయన ఒక లీడింగ్ సివిల్ ఇంజనీరు. రెండు చేతుల్తో – రెండు కాళ్ళతోతెగ సంపాయించేస్తున్నాడు." సారథి తెగబాధపడుతూ చెప్పాడు.

"అబ్బే! ఏం లేదు ఆయన సంపాదన. ఊరికి ఉపకారి... ఎవరైనా ఫీజు ఇచ్చుకోలేం అంటే వదిలేస్తారు. కాస్త సూపర్‌విజన్ చేసి పెట్టండి అంటే చేసి వస్తారు. వాళ్ళు డబ్బులు ఇవ్వరు ఈయన పుచ్చుకోరు! మొహమాటం జాస్తి!" రాణి చెప్పింది.

"పిల్లలు..."

"సెలవులకు మా అమ్మావాళ్ళ ఊరెళ్ళారు." చెప్పింది రాణి.

నా జేబులోంచి చిన్న వాచీ తీశాను.

"నా చిరుకానుక !" వాచీని ఆమె కందించాను... తీసుకుంటుందో తీసుకోదో... అని సందేహించాను.

మొహమాట పడ్తూ.

ఆనందంగా తీసుకుని చేతికి పెట్టుకుంది. కాని వెంటనే అంది-"దీనికి గోల్డు చైన్ ఉంటే ఇంకా బాగుండేది.... నువ్వు తీసుకురావాలని కాదు. మ్యాచింగ్."

"కస్టమ్స్ ప్రాబ్లెమ్ ! ఈసారి ట్రైచేస్తా..." చెప్పాను.

"మావారికి అమెరికాలో ఓ జాబ్ చూడకూడదూ?" అడిగింది.

"ఏంటి? అక్కడికీ అమెరికాలో ఉద్యోగాలు కుప్పలు తెప్పలుగా ఉన్నాయనా నీ ఉద్దేశం?" సారథి అడిగాడు.

"అయినా రాణీ! ఎందుకు నీకా ఆలోచన! మీ ఆయన కూడా బాగానే సంపాదిస్తున్నాడు కదా! దూరపు కొండలు నునుపు! అక్కడ సంపాదన ఉంటుంది కాని... ప్రతీ డాలరుకు ఎంతో కష్టపడాలి. సోమరిగా కూర్చుంటే లాభంలేదు." చెప్పాను.

"నువ్వు ఇప్పిస్తానంటే మావారితో అప్లై చేయిస్తాను. అయినా నీతో పోటీపడతారని భయమా?" రాణి అడిగింది.

"అబ్బే! ఈ జీవితంలో ఎవరు ఎవరికి పోటీ... కాని మేమేదో సుఖపడి పోతున్నామనుకుంటే మీది పొరపాటే! ఎప్పుడూ మేము ఇండియాలో ఉండే మనవాళ్ళ గురించే ఆలోచిస్తూ - మీరు ఎంత హాయిగా ఉన్నారని ఈర్ష్య పడ్తూ ఉంటాం." చెప్పాను.

"మాధవా! వెళదాం...." సారథి లేచాడు.

"ఆల్ ద బెస్ట్....మంచి పనిచేశావు. అమెరికా వెళ్ళి - అయినా అందరూ నీలాగా అదృష్టవంతులుగా పుట్టరులే!"

వీడ్కోలిస్తూ విషాదరాణి పలికిన పలుకులు అవి.

దార్లో సారథి అన్నాడు.

"అదేం ఖర్మో! ఈ రాణి ఎప్పుడూ ఏడుస్తూనే ఉంటుంది. ఈ రోజు నీ మీద ఏడ్చింది. అదే నేను వెళ్తే నామీదపడికూడా ఏడుస్తుంది."

నవ్వేసి ఊరుకున్నాను.

పొంగిపోయింది భారతి మా ఇద్దర్నీ చూసి.

"రండి...స్వాగతం - వెల్‌కమ్! ఏమదృష్టం... ఇన్నాళ్ళకి మీ దర్శన భాగ్యం లభించింది."

భారతి మా స్కూటర్ ఆగీ ఆగగానే చూసి బయటకు పరుగెత్తుకుంటూ వచ్చి ఆహ్వానించింది.

ఆమె పిల్లలు కాబోలు ఆమె ప్రవర్తనను వింతగా చూస్తున్నారు. పిల్లలకు సరియైన బట్టలు వేయలేదు. ఇల్లు బీదరికాన్ని సూచిస్తోంది. అది స్వంత ఇల్లు కాదుట. అద్దె ఇల్లని సారథి చెప్పాడు.

"బాగున్నావా భారతీ! ఏరీ మీ వారు?" అడిగాను.

"ఆ! బాగున్నా! ఆయనా? ఏ అర్ధరాత్రికో వస్తారు." చెప్పింది సంతోషంగా.

"ఏం బాగా సంపాదిస్తారా అర్ధరాత్రిదాకా."

"కాదు- పోగొట్టుకుంటారు. ఏం లేదు పేకాట ఆడందే ఆయనకు నిద్రపట్టదు." చెప్పింది.

"ఓ! అదా సంగతి!.. పిల్లలు ఏం చదువుతున్నారు? అంతా నీ పోలికే!" దగ్గరికి తీసుకున్నాను.

కాలేజీరోజుల్లోలా కాలం తెలీలేదు . ఓ రెండు గంటల తర్వాత వస్తామని లేచాం.

"అయ్యో! నామతి మండా! అరగంటలో వంట చేస్తాను. భోంచేసి వెళ్ళండి." బ్రతిమాలింది.

సారథి మొహంలోకి చూశాను.

'వద్దు' అన్నట్లు అతని కళ్ళల్లో హెచ్చరిక! "వద్దు భారతీ - ఓ పదినిమిషాలు కబుర్లు చెప్పు: అది కాదు భారతీ ఇంత చదువుకుని - కేవలం... హౌస్ వైఫ్‌గా ఉన్నావా! నువ్వు కూడా ఉద్యోగం చేస్తే... ఇంటికి కాస్త చేదోడు వాదోడుగా ఉండవచ్చుగా." ఒక ఉచిత సలహా ఇచ్చాను.

"ఎందుకు లెద్దూ ..ఆడబ్బుల్ని కూడా మాఆయన పేకాటలో తగలేస్తాడు. పిల్లలకు దిక్కులేకుండా పోతుంది. ఇల్లాలిగా నాబాధ్యత సక్రమంగా నిర్వహించగలిగితేనాకదేచాలు. "నవ్వుతూ చెప్పింది.

జేబులోంచి వాచీతీశాను. భారతికి ఇచ్చాను.

"బాగుంది." చూసి వెనక్కి ఇచ్చింది.

"అయ్యో! నీకే- ఉంచుకో- "చెప్పాను.

"ఏం? డబ్బులు ఎక్కువయ్యాయా? ఊళ్ళో వాళ్లందరికీ బహుమతులు తెస్తున్నావా? అయినా నాకు వాచీ ఉంది. "అని ఇవ్వబోయి నా మొహం చూసి ఏమనుకుందో ఏమో ఉంచుకుంది.

సెలవు తీసుకుని బయటికి వచ్చాము.

"సారథీ! ఆమె అంత ప్రేమగా భోజనం పెడతానంటే ఎందుకు వద్దన్నావు?" అడిగాను దారిలో.

"వాళ్ళాయనకు అనుమానం జాస్తి! పైగా బీదవాళ్ళు - మనం ఎందుకు నష్టం కలిగించాలి." సారథి జవాబు చెప్పాడు.

ఆ రాత్రి డాబా మీద పిండారబోసిన వెన్నెల్లో పడుకున్నాం కనకంమా ఇద్దరి పక్కలు అక్కడ ఏర్పాటు చేసింది ఇంటికొచ్చే సరికే!

కబుర్లలో పడిపోయాం.

ఆవులిస్తూ అన్నాడు సారథి.

"అది సరేకానీ మాధవా! ఆనందభైరవిలో ఇంకా ఆ నవ్వు ఎలా నిలిచి ఉందో అర్థం కావడంలేదు. నిజానికి ఆమె ఉన్న పరిస్థితుల్లో నేనైతే ఏడ్చేసేవాడిని. నా జేబులో వెయ్యిరూపాయలు లేకపోతే నాకు జ్వరం వస్తుంది."

"నేనూ అంతే అనుకో!" చెప్పాను మొహమాటానికి.

"ఇంకో ఆశ్చర్యకరమైన విషయమేమిటంటే విషాదరాణి - అలియస్ ఉషారాణి - ఎప్పుడూ నవ్వుతూ ఉండాల్సింది... ఎప్పుడూ ఏడుస్తూ ఉంటుంది. చూడూ ఆమెకు మూడంతస్తుల భవనం ఉంది. ఐదు వేలు అద్దె వస్తుంది.వాళ్ళాయన ఇరవై వేలు సంపాదిస్తాడు. మారుతీకారు వేసుకు తిరుగుతాడు. అయినా ఆమె ఎప్పుడూ సంతోషంగా ఉన్నట్లు కన్పళ్ళేదు." నిద్రపోతూనే చెప్పాడు.

"అది సరే! నువ్వు ఆనందంగా ఉన్నావా? ఇంకా విషాదరాణిని కాని - ఆనందభైరవిని కాని చేసుకోలేదని ఏడుస్తున్నావా?" కుతూహలం ఆపుకోలేక అడిగాను.

"అది నువ్వు అడగకూడదు... నేను చెప్పకూడదు." అంటూ నిద్రపోయాడు.

ఆ ఉదయం ఇంకొంత మంది పాత స్నేహితుల్ని కలిసివచ్చాం. మర్నాడు సాయంత్రం- ఓ మారుతీ వచ్చి ఇంటి ముందు ఆగింది. అందులోంచి రాణీ, వాళ్ళాయన వాసూ దిగారు.

"మాధవగారూ- మా ఆవిడ చెప్పింది మీ గురించి, నాకైతే అమెరికాకు రావడం ఇష్టం లేదు కాని తన బలవంతం మీద ఓ అప్లికేషన్ ఇస్తున్నాను మీకు. వీలైతే ట్రై చేయండి." వాసు సిగ్గుపడ్తూ ఇచ్చాడు.

"చూడు మాధవా! కనీసం మూడు లక్షలు నెలకు వచ్చే ఉద్యోగం చూడూ - మా పక్కింటి వాళ్ళబ్బాయి రెండు లక్షలు సంపాదిస్తున్నాడు. వాళ్ళ కంటే మా ఆయన సంపాదన ఎక్కువ ఉండాలి." రాణి చెప్పింది.

వాళ్ళు వెళ్ళబోతూ ఉంటే ఆటోలో భారతీ, వాళ్ళాయన నారాయణా దిగారు.

ఓ అరగంట అయింతర్వాత అసలు విషయం చెప్పింది భారతి. వాచీ తీసుకున్నందుకు కోప్పడుతున్నాడట. వెనక్కి ఇచ్చేద్దామని వచ్చింది.

"మాధవగారూ! ఈ వాచీ మీ వాళ్ళకి ఇవ్వండి. మాకున్నాయి - లేదా డబ్బులు తీసుకోండి." నారాయణ చెబుతున్నాడు.

నా నోట మాట రాలేదు. వాచీ తీసుకుని జేబులో వేసుకున్నాను.

అరగంట తర్వాత, భారతి ఒంటరిగా దొరికినప్పుడు అడిగాను.

"భారతి! ఇటువంటి వాడితో కాపురం చేస్తూ ఎలా ఆనందంగా ఉండగలుగుతున్నావు?"

"నాకేం! అయామ్‌హ్యాపీ! మా పక్కింటి గోపాల్ అయితే పెళ్ళాన్ని తంతాడు - బాగా తాగొచ్చి బూతులు తిడతాడు. మూడు నెల్లకోసారి పుట్టింటి నుంచి డబ్బులు తెమ్మని తరిమికొడతాడు. ఇంకా ఇంటిల్లిపాదినీ పస్తులు పడుకోబెడతాడు. ఆ కుటుంబంతో పోలిస్తే - మా ఆయన బంగారం!" భారతి చెప్పింది నవ్వుతూ.

ఆనందభైరవి ఎందుకు ఆనందంగా ఉంటుందో - విషాదరాణి ఎందుకు విషాదంగా ఉంటుందో నాకు అర్థమైంది! ★

(అమృత కిరణ్ పక్షపత్రిక)

